TGTEL/26/A0372

మన మహాతి న్యూస్

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ :డాక్టర్. ప్రకాష్ జాదవ్ | మంగళవారం జూన్ 02, 2026 | సంపుటి : 01 | సంచిక : 124 | పేజీలు 5 | వెల-2/- | MANAMAHATINEWS.COM

రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలకు నోటిఫికేషన్

ఏపీ సహా 10 రాష్ట్రాల్లోని రాజ్యసభ స్థానాలకు, మూడు రాష్ట్రాల శాసన మండలి స్థానాల కు ఈసీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. జూన్ 18న ఎన్నికలు నిర్వహించనున్నట్టు వెల్లడించింది. జూన్, జులైలో 24 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది. ఈ స్థానాలతో పాటు పదవీకాలం ముగియకుండానే ఖాళీయైన మూడుస్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. దీంతో మొత్తం 27 స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. నేటి నుంచి ఈ నెల 8వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 9న నామినేషన్ల పరిశీలన. నామినేషన్ల ఉపసంహరణకు జూన్ 11 వరకు గడువు తేదీగా ఈసీ ప్రకటించింది. ఎన్నికలు ముగిసిన రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరగనుంది. బిహార్‌లోని తొమ్మిది రాష్ట్ర శాసన మండలి స్థానాలకు ఎన్నికలు జరగనుండగా ఒక స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించనున్నారు.

30 ఏళ్లలో తొలిసారి.. 'టెర్రర్ ఫ్రీ మంత్'గా మే

శ్రీనగర్: జమ్మూ కశ్మీర్‌లో ఒక్క ఉగ్రవాద సంబంధిత హత్య గానీ, దాడి గానీ జరగని నెలగా 'మే 2026'ను అధికారులు గుర్తించారు. గత 30 ఏళ్లలో ఎలాంటి ఉగ్ర చర్యలు జరగని మాసం అంటూ లేదని ఏదీ లేదని, తొలిసారి ఈ మే నెలలో ఒక్క దాడి కూడా జరగలేదని వారు పేర్కొన్నారు. అధికారిక గణాంకాల ప్రకారం, ఈ ఏడాది మొదటి ఐదు నెలల్లో కేవలం 12 ఉగ్రవాద సంబంధిత మరణాలు నమోదయ్యాయి. అయితే, వీటిలో సామాన్య పౌరులెవరూ చనిపోలేదు. అత్యధికంగా 2000 సంవత్సరం మే నెలలో 288, 2001 మేలో 300 ఉగ్రవాద సంబంధిత మరణాలు నమోదయ్యాయి.

2001లో జమ్మూ కశ్మీర్ లోని పలు ప్రాంతాల్లో దాదాపు ప్రతిరోజూ ఉగ్ర ఘటనల్లో పౌరులు, ఉగ్రవాదులు, భద్రతా సిబ్బంది మరణించేవారు. రోజులు గడుస్తున్న కొద్దీ మరణాల తీవ్రత క్రమంగా తగ్గుతున్నప్పటికీ హింసాత్మక ఘటనలు మాత్రం కొనసాగుతునే ఉండేవి. 2002లో మేలో ఉగ్రవాద సంబంధిత హత్యల సంఖ్య -288గా ఉండగా.. పేజి 2లో ▶

స్పోర్ట్స్ కోటాపై ఆరోపణలు అవాస్తవం: అజయ్ జైన్

- డీఎస్సీలో 431 పోస్టులు స్పోర్ట్స్ కోటాకు
- 3,600 మంది దరఖాస్తులు
- 382 మంది మెరిట్ ఆధారంగా ఎంపిక
- 39 పోస్టులు ఖాళీగా ఉన్నాయి
- ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకమని స్పష్టం
- అన్ని ఫిర్యాదులు పరిష్కరించామని వెల్లడి
- స్పోర్ట్స్ కోటా ఎంపికలు సక్రమంగానే జరిగాయని ప్రకటన

2లో

వర్షాభావంపై రైతులకు అవగాహన

నీటి వినియోగం తక్కువున్న పంటలపై వివరణ
పంటల మార్పిడి, వైవిధ్యంపై రైతులకు తెలియచేయాలి
దెబ్బతిన్న రోడ్లు, కూలిపోయిన వంతెనల పునరుద్ధరణ
అత్యవసర పనుల కోసం వేయికోట్ల నిధులతో పనులు
వర్షాకాల సన్నద్ధతపై అధికారులతో సిఎం సమీక్ష
స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన సిఎం రేవంత్ రెడ్డి

వర్షాభావ పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. తక్కువ నీరు వినియోగించుకునే పంటలపై రైతులకు వివరించాలన్నారు. పంట మార్పిడి ప్రాధాన్యాన్ని అన్నదాతలకు తెలియజేయాలని సీఎం ఆదేశించారు. వర్షాకాల సన్నద్ధతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో సమీక్ష జరిగింది. ఈ సమావేశానికి వ్యవసాయ, నీటి పారుదల, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఆరోగ్య, హోం, హైడ్రా, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. నైరుతి రుతుపవనాలతో వచ్చే వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం, ఇతర అంశాలపై వాతావరణ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తెలంగాణలో ప్రాజెక్టుల మెయింటెనెన్స్ పనులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారు. గేట్లు, నిర్వహణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుల మెయింటెనెన్స్‌కు అవసరమైన నిధులు తక్షణమే విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. విపత్తు నిర్వహణ శాఖ వద్ద ఉన్న రూ.1000కోట్లను నిబంధనల ప్రకారం వినియోగించాలన్నారు. దెబ్బతిన్న రోడ్లు, కూలిపోయిన వంతెనల నిర్మాణానికి అవసరమైన నిధులు వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. విపత్తుల సమయంలో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం వాటిల్లినప్పుడు తక్షణమే అధికారులు స్పందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కలిసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

దిల్లీ: దిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ?ఇటీవల ఝార్ఖండ్‌లో పర్యటించిన భట్టి విక్రమార్క.. అక్కడి సీఎం హేమంత్ సోరెన్, స్థానిక కాంగ్రెస్ నాయకులతో చర్చలు జరిపారు. పార్టీ వ్యవహారాలకు సంబంధించి ఓ నివేదికను రూపొందించారు. ఆ నివేదికను తాజాగా కేసీ వేణుగోపాల్‌కు అందజేశారు.

ఎన్నో పోరాటాల ఫలితమే విశాఖ రైల్వే జోన్:

- ఎన్నో పోరాటాల ఫలితమే రైల్వే జోన్
- లక్షలాది ప్రయాణికులకు ప్రయోజనం
- రైల్వే అభివృద్ధితో ఉత్తరాంధ్ర అభివృద్ధి
- పార్లమెంట్‌లో నిరంతరం పోరాటం చేశా
- ఇచ్ఛాపురం స్టేషన్‌కు రూ.12 కోట్ల అభివృద్ధి
- బ్రిడ్జి సమస్యకు త్వరలో పరిష్కారం

2లో

డఫాబెట్.. బెట్టింగ్ కేసులో 11 మందిని అరెస్టు చేసిన సీఐడీ

మిగతాది 2లో

హైదరాబాద్: ఆర్థిక నష్టం కలిగిస్తూ, యువత ఆత్మహత్యలకు కారణం అవుతున్న ఆన్‌లైన్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్స్‌పై తెలంగాణ సీఐడీ ప్రత్యేక దృష్టి సారించింది. వీటిపై ఇప్పటికే సిట్ ఏర్పాటు చేసిన సీఐడీ.. ఓ కేసు దర్యాప్తులో భాగంగా అంతర్జాతీయ బెట్టింగ్ రాకెట్‌ను ఛేదించింది. బెట్టింగ్ ప్లాట్‌ఫామ్ 'డఫాబెట్' వేదికగా మోసాలకు పాల్పడుతున్న 11 మందిని సీఐడీ అధికారులు అరెస్టు చేశారు.

లాభాలు సంపాదించే పరిశ్రమలు పన్నులు చెల్లించకపోతే ఎలా?: పవన్

- పరిశ్రమలు పన్నులు తప్పనిసరిగా చెల్లించాలి: పవన్
- పంచాయతీ పన్ను బకాయిలపై ఆగ్రహం
- ఆంధ్రా పేపర్ మిల్స్‌కు రూ.19 కోట్లు బకాయిలు
- విద్యాసంస్థల వద్ద కూడా భారీ బకాయిలు
- పన్నులు వసూలైతే రూ.5,400 కోట్ల ఆదాయం
- రాజకీయ ఒత్తిళ్లకు లొంగొద్దు
- ప్రత్యేక డ్రైవ్‌తో పన్నుల వసూళ్లు
- సీఎంతో, మంత్రివర్గంతో చర్చిస్తా: పవన్

అమరావతి: పరిశ్రమలు, ప్రైవేటు విద్యా సంస్థలు సరిగా పన్నులు చెల్లించకపోవడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ అధికారులతో గ్రామపంచాయతీలకు రావాల్సిన పన్నులపై పవన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. లాభాలు సంపాదించే పరిశ్రమలు పంచాయతీలకు పన్నులు చెల్లించకపోతే ఎలా? అని అసహనం వ్యక్తం చేశారు.

"గ్రామాల్లో వనరులు వాడుకుంటూ పన్నులు కట్టకపోవడమేంటి?. ఆంధ్రా పేపర్ మిల్స్ రూ.19 కోట్లు బకాయిలు పెట్టింది. విద్యాసంస్థలకు సంబంధించి కూడా భారీగా బకాయిలు ఉన్నాయి. రాష్ట్రంలో పంచాయతీ పన్నులు వసూలైతే రూ.5,400 కోట్లకుపైగా వస్తాయి. పేదలు, కులవృత్తులవారు, చిరుద్యోగులు కూడా పన్నులు చెల్లిస్తున్నారు. పరిశ్రమలు, విద్యాసంస్థలు పన్నులు కట్టని విషయం ప్రజలకు తెలియదు. రాజకీయ ఒత్తిళ్లు ఉన్నా పన్ను వసూళ్ల విషయంలో ముందుకెళ్లాలి. సీఎంతోపాటు మంత్రివర్గంతోనూ నేను మాట్లాడతా. పల్స్ సర్వే తరహాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పన్ను వసూళ్ల కార్యాచరణ చేపట్టాలి"అని అధికారులకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

మహారాష్ట్ర సీఎంతో ఏపీ మంత్రి లోకేశ్ భేటీ..

పెట్టుబడులు, విద్యావిధానాలపై చర్చ

- విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు కోరిన లోకేశ్
- ఏఐ హబ్‌గా వైజాగ్ ఎదుగుతోందని వెల్లడి

మిగతాది 2లో

- మహారాష్ట్ర సీఎం ఫడణవీస్‌తో లోకేశ్ భేటీ
- పెట్టుబడులు, విద్యా సంస్కరణలపై చర్చ
- స్కిల్ డెవలప్‌మెంట్ విధానాలు వివరించిన లోకేశ్
- మహారాష్ట్ర ఉత్తమ విధానాలపై ఆరా
- ఎయిర్‌ట్రంక్ సీఈవోతో సమావేశం

ఫోన్ ట్యాపింగ్ చేసిన కేసీఆర్‌కు మళ్లీ ఓట్లు అడిగే హక్కు లేదు

మిగతాది 2లో

హైదరాబాద్: కేసీఆర్ ప్రభుత్వం పౌరుల హక్కులను హరించిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వ్యక్తుల కుటుంబాల్లోకి తొంగిచూసి, బెదిరించి లొంగదీసుకోవాలని చూశారని మండిపడ్డారు.

కంప్యూటర్ బేస్డ్ పరీక్షల నిర్వహణే ఉత్తమమైంది: టీజీపీఎస్సీ ఛైర్మన్

మిగతాది 2లో

హైదరాబాద్: తమది చాలా క్లిష్టమైన ఉద్యోగమని, అందరినీ మెప్పించడం సాధ్యం కాదని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం అన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అందరికీ ఉద్యోగాలు ఇవ్వడం ఎప్పటికీ సాధ్యం కాదని, టీజీపీఎస్సీపై అసత్యాలు ప్రచారం చేసేవారు ఎప్పుడూ ఉంటారని అన్నారు. ఈ నెలలో 5 నుంచి 6 నోటిఫికేషన్లు విడుదల చేస్తామని చెప్పారు.

సంపాదకీయం

చాయిస్ ఈజ్ యువర్స్ మిస్టర్ జగన్‌రెడ్డి!

తమ కుటుంబంలో జరిగిన మూడు మరణాలను ప్రస్తావించడం ద్వారా మళ్లీ సానుభూతి పొందాలని జగన్ ప్రయత్నిస్తున్నారేమో తెలియదుగానీ తమ కుటుంబ రక్త చరిత్రను ఆయనే బయటపెట్టుకున్నారు. రాజారెడ్డి (వైఎస్ తండ్రి) ఎలాంటి వారు? ఎన్ని నేరాలు చేశారు? వంటి విషయాలను తాను సీఎం అయ్యాక ప్రజలు మరచిపోయేలా రాజశేఖరరెడ్డి చేయగలిగారు.

పోయినోళ్లందరూ మంచోళ్లని సర్దుకుపోయే ఉదారవాదం మన నైజం కాబట్టే మరణానంతరం వైఎస్ 'మహానేతగా' మారిపోయారు. నిజానికి రాజారెడ్డి కంటే వైఎస్సే 'డేంజరస్' అని సీమకు చెందిన, మరీ ముఖ్యంగా కడపకు చెందిన ఆయన ప్రత్యర్థులు గజగజ వణుకుతూ వారికి ఎదురైన భయానక అనుభవాలను చెబుతుంటారు.

వైఎస్ మరణాన్ని కొంతకాలం, వివేకానంద రెడ్డి హత్యను మరికొంత కాలం రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్న జగన్ రెడ్డి తాను తులసి మొక్కను అని చెప్పుకోవడాన్ని మించిన జోక్ మరేమి ఉంటుంది?

మనం మంచివాళ్లం అవునా కాదా అన్నది ముందుగా మన కుటుంబ సభ్యులే సర్టిఫికెట్ ఇవ్వాలి. జగన్ ఉత్తమ మానవుడు అని వైఎస్ కుటుంబ సభ్యుల్లో ఒక్కరైనా సర్టిఫికెట్ ఎందుకు ఇవ్వడం లేదన్న ప్రశ్నకు సమాధానం రావాలి కదా? నిజానికి వైఎస్ కుటుంబానికి ప్రారంభంలో ఆస్తిపాస్తులు పెద్దగా లేవు. రాజారెడ్డి తండ్రి వెంకటరెడ్డి చాలా చిన్న రైతు. రాజారెడ్డి ఫ్యాక్షన్ మార్గాన్ని ఎంచుకున్న తర్వాత వైఎస్ కుటుంబానికి ఆస్తులు సమకూరడం మొదలైంది. వైఎస్ సీఎం అయ్యాక జగన్ విన్యాసాలు చూశాం. ఈ దేశ చరిత్రలోనే ఎవరూ నిర్మించలేని విధంగా వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు. పేర్ల పార్థసారథి రెడ్డి చెబుతున్నట్టుగా రాజారెడ్డి కుటుంబం రక్తపు కూడు తిని పెరిగిందన్న మాట!

జగన్ గురువారం విలేకరుల సమావేశంలో నా పేరు కూడా ప్రస్తావించారు. పేరు ప్రస్తావనకే పరిమితం కాకుండా అమరావతిలో ప్లాట్ల కేటాయింపులో నా కుమారుడు, కుమార్తె అనుచిత లబ్ధి పొందినట్టుగా ఆరోపణలు చేశారు.

..నువ్వు ఆరోపణ చేయడం– నేను సమాధానం చెప్పడం కాదు గానీ, ఒక పని చేద్దాం! ప్లాట్ల కేటాయింపులో అధికారులను నేను గానీ, మా సిబ్బంది గానీ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావితం చేసినట్టుగా జగన్ అండ్ కో రుజువు చేస్తే సదరు ప్లాట్లను తిరుమల తిరుపతి దేవస్థానానికి విరాళంగా ఇచ్చేస్తాం. జగన్ అండ్ కో మాత్రమే కాదు ఇతరులు ఎవరైనా మేం అనుచిత లబ్ధి పొందినట్టు రుజువు చేసినా సదరు ప్లాట్లను వారికి ఉచితంగా ఇచ్చేస్తాం. మేం తప్పు చేసినట్టు లేదా అయాచిత ప్రయోజనం పొందినట్టు రుజువు చేస్తే సదరు ప్లాట్లను జగన్‌కి ఇవ్వడానికి కూడా మేము సిద్ధం.తాను చేసిన ఆరోపణలపై జగన్‌కు నమ్మకం ఉంటే ఈ సవాలును స్వీకరించాలి. లేదంటే, మానవ జాతి పరిణామ క్రమంలోనే జగన్ వంటి వ్యక్తి మరొకరు ఉండరని మేం భావించాల్సి ఉంటుంది.ఒళ్లంతా బురద పులుముకున్న ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాను పూసుకున్న బురదను ఇతరులకు అంటించాలనుకుంటున్నారు. మానవ జాతిలో తనను మించిన ఉత్తమ పురుషుడు మరొకరు లేరని భ్రమిస్తున్న ఆయన, తనను వ్యతిరేకించే వారందరూ అవినీతిపరులని, హంతకులని చిత్రించే ప్రయత్నం కూడా చేస్తున్నారు. అయితే ఉగాది పంచాంగ శ్రవణంలో ఆయన పిలిపించుకున్న పండితుడు ఈ ఏడాది గ్రహబలం అనుకూలంగా లేదని చెప్పినట్టుగానే జగన్‌రెడ్డి గురువారంనాడు విలేకరుల సమావేశంలో చేసిన విన్యాసాలు ఆయనకే ఎదురు తగిలాయి. తన తాత రాజారెడ్డి హత్య, తండ్రి రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదాలను ప్రస్తావించడం ద్వారా జనం మరచిపోయిన విషయాలను ఆయన గుర్తుచేశారు. తమ కుటుంబంలో జరిగిన హత్యలతో పాటు కొన్ని దశాబ్దాలుగా తెలుగునాట జరిగిన అనేక హత్యల వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారని చెప్పే ప్రయత్నం చేయడం ద్వారా 'ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే' అనే సామెతను గుర్తుచేశారు. నిజానికి జగన్‌రెడ్డి తాత వైఎస్ రాజారెడ్డి గురించి ఈ తరానికి తెలియదు. ఆయనను ఎవరు.. ఎందుకు హత్య చేశారో కూడా తెలియదు. హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన రాజశేఖరరెడ్డిని మహా నేతగా భావిస్తున్న ఈ తరం వారికి ఆయనకు కూడా ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్న సంగతి తెలియదు. ఇప్పుడు పాత విషయాలను ప్రస్తావించడం ద్వారా తండ్రీ తాతల నేపథ్యం గురించి ఈ తరం వారు తెలుసుకొనే పరిస్థితిని జగన్‌రెడ్డి కల్పించారు. వైసీపీ అంటే గొడ్డలి పార్టీ అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవలి కాలంలో తరచుగా చురకలంటిస్తున్నారు. దీంతో జగన్‌రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి హత్యా రాజకీయాలకు చంద్రబాబు పెట్టింది పేరు అని, తాను మంచోడు కనుకే తాత రాజారెడ్డిని చంపినవాళ్లు ప్రశాంతంగా బతకగలుగుతున్నారని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు. అయితే రాజారెడ్డి వర్గీయులు చేసిన హత్యాయత్నం నుంచి ప్రాణాలతో బయటపడి ఆ తర్వాత తన వర్గీయులతో రాజారెడ్డిని చంపించిన పేర్ల పార్థసారథిరెడ్డి అప్పుడేం జరిగిందో కుండబద్దలు కొట్టారు.మొదట రాజారెడ్డి వర్గీయులు తనపై దాడి చేసి చంపే ప్రయత్నం చేశారని, ఆ సందర్భంగా తన శరీరంపై 26 కత్తిపోట్లు పడ్డాయని, తాను చనిపోయాననుకొని వదిలి వెళ్లిపోయారని ఆయన వివరించారు. అనంతరం తన వర్గీయులు రాజారెడ్డిపై దాడి చేసి చంపారని ఆయన జరిగింది జరిగినట్టుగా చెప్పుకొచ్చారు. వైఎస్ కుటుంబం వల్ల తన కుటుంబం ఆర్థికంగా చితికిపోయిందని కూడా ఆయన ఏకరువు పెట్టారు. పార్థసారథిరెడ్డిపై జరిగిన హత్యాయత్నం, ఆ తర్వాత జరిగిన రాజారెడ్డి హత్య ఫ్యాక్షన్ రాజకీయాలలో భాగమే! దాదాపు మూడు దశాబ్దాల క్రితం ఇవి జరిగాయి. అప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నారు. ఇప్పుడు నేను అంత మంచివాడిని, ఇంత మంచివాడిని అని చెప్పుకొంటున్న జగన్మోహన్‌రెడ్డి అప్పట్లో తన తాత రాజారెడ్డిపై దాడి చేసిన వారిని చంపాలనుకున్నారు. ఈ విషయాన్ని వైఎస్ రాజశేఖరరెడ్డి స్వయంగా అప్పటి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, అందరూ కాకాగా పిలుచుకొనే దివంగత వెంకటస్వామి వద్ద ప్రస్తావించారు. 'మా నాన్నను చంపినవాళ్లను చంపుతానని మా వాడు కత్తి పట్టుకొని తిరుగుతున్నాడు. జరగరానిది జరిగితే నా రాజకీయ జీవితం దెబ్బతింటుంది. ఏదైనా సలహా ఇవ్వండి' అని కాకాను రాజశేఖరరెడ్డి అప్పట్లో కోరారు. ఈ విషయాన్ని దివంగత వెంకటస్వామి ఓ సందర్భంలో నా వద్ద ప్రస్తావించారు. 'నీ కొడుకుని పులివెందుల పరిసరాల్లో ఉండనివ్వొద్దు' అని తాను రాజశేఖరరెడ్డికి సూచించినట్టు కాకా తెలిపారు. దీన్నిబట్టి జగన్‌రెడ్డి ఇప్పుడు చెప్పుకొంటున్నట్టుగా అంత మంచోడు కాదని స్పష్టమవుతోంది. తండ్రి రాజశేఖరరెడ్డి అడ్డుపడి ఉండకపోతే జగన్‌రెడ్డి చేతులకు కూడా రక్తం అంటి ఉండేదన్నమాట! కత్తి చేతబట్టినవాడు ఆ కత్తికే బలవుతాడు అని అంటారు. అప్పట్లో రెండు వర్గాలకు నాయకత్వం వహించిన రాజారెడ్డి, పార్థసారథిరెడ్డి ఫ్యాక్షన్ దాడులు జరిపించారు. రాజారెడ్డి మరణించగా, పార్థసారథిరెడ్డి ప్రాణాలు దక్కించుకున్నారు. ఇదంతా గతం. నిజానికి గురువారంనాడు ఏబీఎన్ డిబేట్‌లో పార్థసారథిరెడ్డి పాల్గొనే వరకు ఆయనే రాజారెడ్డిని చంపిన వారికి నాయకుడు అని ఈ తరానికి తెలియదు. రాజారెడ్డి హత్యా రాజకీయాలు చేసేవారన్న విషయం కూడా తెలియదు. ఇప్పుడు జగన్‌రెడ్డి పుణ్యమా అని వైఎస్ కుటుంబ నేర చరిత్ర గురించి తెలుసుకొనే అవకాశం ఈ తరానికి లభించింది. 2019--2024 మధ్య ఆంధ్రప్రదేశ్‌లో అమలైన 'రాజారెడ్డి రాజ్యాంగం' అంటే ఏమిటో ఇప్పుడు జనబాహుళ్యానికి మరింతగా అర్థమవుతోంది.

పాపాలే.. శాపాలై!

తన తండ్రి రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మరణించడంపై ఇప్పటికీ అనుమానాలు ఉన్నాయని జగన్‌రెడ్డి తాజాగా చెప్పడం ఈ మొత్తం ఎపిసోడ్‌లో హైలెట్! ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌రెడ్డి తన తండ్రి రాజశేఖరరెడ్డి మరణంపై అనుమానాలు ఉన్నాయని ఒక్కసారి కూడా చెప్పలేదు. నాటి సంఘటనపై విచారణ జరిపించే ఆలోచనా చేయలేదు. రాజశేఖరరెడ్డి మరణం వల్ల ప్రజల్లో పెల్లుబికిన సానుభూతిని తన రాజకీయ పరమపద సోపానానికి వాడుకున్న జగన్‌రెడ్డి, అధికారంలోకి రాగానే అన్నీ మరచిపోయారు.

డఫాబెట్.. బెట్టింగ్ కేసులో 11 మందిని అరెస్టు చేసిన సీఐడీ

మొదటిపేజీ తరువాయి

కరీంనగర్‌కి చెందిన ఓ బాధితుడు డఫాబెట్‌లో దాదాపు రూ.10లక్షలు మోసపోయిన కేసులో దర్యాప్తు ప్రారంభించిన సీఐడీ.. న్యూ దిల్లీ, గుజరాత్, పంజాబ్‌కు బృందాలను పంపి ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించింది. ఈ ఆపరేషన్‌లో ఒక అఫ్గానిస్థాన్ దేశస్థుడు సహా 11 మందిని అరెస్ట్ చేశారు. వీరంతా బెట్టింగ్ నిర్వాహకులని సీఐడీ చీఫ్ చారు సిన్హా తెలిపారు. నిందితుల నుంచి 3 కార్లు, 8 ల్యాప్‌టాప్‌లు, 26 మొబైల్స్, 5 పాస్‌పోర్టులు, రూ.3.21లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులపై ఏపీ, గుజరాత్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణలో 225 కేసులు ఉన్నట్లు తెలిపారు.

ఫోన్ ట్యాపింగ్ చేసిన కేసీఆర్‌కు మళ్లీ ఓట్లు అడిగే హక్కు లేదు

మొదటిపేజీ తరువాయి

ప్రజల వ్యక్తిగత గోప్యతను హరించిన కేసీఆర్‌కు మళ్లీ ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. 'కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తే లక్షల మంది ఫోన్లపై నిఘా పెడతారు. ప్రజల ఫోన్లపై నిఘా పెట్టి ఎవరెవరు ఓటు వేయలేదో తెలుసుకొని వేధిస్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వ ఫోన్ ట్యాపింగ్ రాక్షసక్రీడలో ఎంతోమంది బలైపోయారు. వ్యవస్థీకృతంగా క్రూరమైన నేరం చేసిన వాళ్లు మళ్లీ అధికారంలోకి వస్తామని కలలు కంటున్నారు. జడ్జీలు, జర్నలిస్టులు, నటులు, రాజకీయ నేతలు ఇలా అన్ని వర్గాల ఫోన్లను ట్యాప్ చేశారు. బాధితులకు న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉంది"అని అన్నారు.

కంప్యూటర్ బేస్డ్ పరీక్షల నిర్వహణే ఉత్తమమైంది: టీజీపీఎస్సీ ఛైర్మన్

మొదటిపేజీ తరువాయి

"మీడియాతో మాట్లాడకపోవడం కంటే మాట్లాడటమే మంచిదని భావిస్తున్నాం. అందుకే, ఇకపై 2, 3 నెలలకోసారి మీడియా సమావేశాలు నిర్వహిస్తాం. పరీక్షల విషయానికొస్తే కంప్యూటర్ బేస్డ్ పరీక్షల నిర్వహణే ఉత్తమమైంది. ఈ విధానంలో పరీక్షకు గంట ముందు కూడా ప్రశ్నాపత్రం రూపొందించవచ్చు. ఓఎంఆర్ పద్ధతిలో పరీక్ష నిర్వహణ చాలా క్లిష్టమైంది. పరీక్షల నిర్వహణలో అనేక సంస్కరణలు తెస్తున్నాం. టీజీపీఎస్సీ పరీక్షలన్నీ కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించే దిశగా వెళ్తున్నాం. ప్రతి నెలా 2, 3 నోటిఫికేషన్లు ఇస్తాం. ప్రస్తుతం 28 రకాల పోస్టులకు ఒక్కో ఖాళీ ఉంది. ఇంకో 25 రకాల పోస్టుల్లో 5 కంటే తక్కువ ఖాళీలు ఉన్నాయి. జూన్ 2న మూడు నోటిఫికేషన్లు విడుదల చేస్తాం. 3,800 పోస్టులకు ఆర్థిక శాఖ నుంచి అనుమతి వచ్చింది. 1,393 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులు ఉన్నాయి" అని బుర్రా వెంకటేశం తెలిపారు.

స్పోర్ట్స్ కోటాపై ఆరోపణలు అవాస్తవం: అజయ్ జైన్

మొదటిపేజీ తరువాయి

అమరావతి: డీఎస్సీ 2025 నియామకాల్లో స్పోర్ట్స్ కోటాపై వస్తున్న ఆరోపణలను ఏపీ ప్రభుత్వం ఖండించింది. అవన్నీ అవాస్తవాలని స్పోర్ట్స్ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్ స్పష్టం చేశారు. 2024 డిసెంబర్‌లో ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీని ప్రకటించిందని తెలిపారు. ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లను 2–3శాతానికి పెంచామని చెప్పారు. స్పోర్ట్స్ కోటా 65 క్రీడలకు వర్తిస్తుందన్నారు.

"డీఎస్సీ 2025లో 16,347 పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. 3 శాతం రిజర్వేషన్‌లో భాగంగా 431 పోస్టులు స్పోర్ట్స్ కోటాకు కేటాయించాం. ఆన్‌లైన్‌లో 3,600 మంది దరఖాస్తు చేసుకున్నారు. మెరిట్ లిస్టులో 382 మందిని స్టేట్ లెవల్ కమిటీ ఎంపిక చేసింది. మరో 39 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. స్పోర్ట్స్ సర్టిఫికెట్లు జారీ చేసేది ఫెడరేషన్లు, అసోసియేషన్లు, వర్సిటీలే. ఆ సర్టిఫికెట్లను క్రీడాశాఖ, శాప్ జారీ చేయదు. స్పోర్ట్స్ కోటా దరఖాస్తుదారుల పత్రాలను అన్ని కోణాల్లో పరిశీలించాం. హైకోర్టులో 69 కేసులు నమోదు కాగా.. 3 కేసులు కొట్టివేసింది. మొత్తం 192 ఫిర్యాదులు అందగా.. అన్ని డిస్పోజ్ చేశాం. స్పోర్ట్స్ కోటాలో ఎంపిక అంతా సక్రమంగా జరిగింది"అని అజయ్ జైన్ తెలిపారు.

అందుకే సూట్ వేసుకుంటున్నా.. అసలు విషయం చెప్పిన సీఎం విజయ్

తమిళనాడు సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విజయ్ (జవీ ఎఅయిఎ) మొదటిసారి బహిరంగ ర్యాలీలో పాల్గొన్నారు. తిరుచ్చిలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతూ.. ఎన్నికల్లో తన పార్టీని గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా కాకుండా ప్రజల సేవకుడిగా పని చేస్తానన్నారు. భవిష్యత్తులో జరగబోయే అన్ని ఎన్నికల్లోనూ ప్రజల మద్దతు లభిస్తుందని దృఢంగా నమ్ముతున్నానని అన్నారు. ఎన్నికల్లో తన విజయాన్ని దివంగత ముఖ్యమంత్రి ఎంజీఆర్ విజయంతో పోలుస్తున్నారని విజయ్ పేర్కొన్నారు. కానీ తాను అంత గొప్ప నేతతో పోల్చుకోవట్లేదని.. ఎంజీఆర్, అన్నా, పెరియార్ చూపిన మార్గంలో పని చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. రాష్ట్ర హక్కులు, లౌకికవాదం విషయంలో ఎటువంటి రాజీ ఉండబోదన్నారు.

డీఎంకే– అన్నాడీఎంకేపై విజయ్ విమర్శలు గుప్పించారు. ఆరు నెలలపాటు మౌనంగా ఉంటామని చెప్పినవారు.. ఆరు రోజులు కూడా మౌనంగా ఉండలేకపోయారని అసహనం వ్యక్తం చేశారు. కుటుంబ రాజకీయాల వల్లే డీఎంకే (ణవీఖ) ఎన్నికల్లో ఓటమి చవిచూసిందన్నారు. ఇన్నేళ్లుగా వంతులవారీగా మోసం చేస్తున్న రెండు పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. అయినప్పటికీ తన ప్రభుత్వాన్ని కూలదోసి అధికారం చేపట్టాలని ఆ పార్టీల నేతలు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. తమిళనాడు రాజకీయాల్లో ఇప్పటికీ ఎప్పటికీ పోటీ డీఎంకే–టీవీకే మధ్యే ఉంటుందన్నారు.

సూట్ ఎందుకు వేసుకోలేదు..?

ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి విజయ్ బ్లాక్ అండ్ వైట్ సూట్‌లోనే అన్ని అధికారిక కార్యక్రమాలకు హాజరవుతున్నారు. బహిరంగ సభకు ఆయన సూట్‌లో రాకపోవడంతో మీరు సూట్ ఎందుకు వేసుకోలేదని ఓ వ్యక్తి ప్రశ్నించాడు.

వర్షాభావంపై రైతులకు అవగాహన

మొదటిపేజీ తరువాయి

ఈ సమావేశంలో వ్యవసాయ, నీటి పారుదల, పట్టణాభివృద్ధి, పంచాయతీ రాజ్, ఆరోగ్య, హోమ్, హైడ్రా, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు. సమీక్ష సందర్భంగా రైతులకు వర్షాభావ పరిస్థితులపై ముందస్తు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై రైతులకు స్పష్టమైన సమాచారం అందించాలని సూచించారు. అలాగే పంటల మార్పిడి, పంటల వైవిధ్యీకరణ వల్ల కలిగే ప్రయోజనాలను అన్నదాతలకు వివరించాలని అన్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల నిర్వహణ, మరమ్మతుల పనులపై కూడా సీఎం ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రాజెక్టుల గేట్లు, ఇతర నిర్వహణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పనులకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు. భారీ వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, కూలిపోయిన వంతెనల పునర్నిర్మాణానికి అవసరమైన నిధులను తక్షణమే విడుదల చేయాలని ఆదేశించారు. విపత్తుల సమయంలో ప్రాణనష్టం, ఆస్తి నష్టం, పశువుల నష్టం వంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు అధికారులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా రామగుండం ఫెర్టిలైజర్స్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయ్యే యూరియా మొత్తం తెలంగాణ రైతుల అవసరాల కోసం కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.

30 ఏళ్లలో తొలిసారి.. 'టెర్రర్ ఫ్రీ మంత్'గా మే

మొదటిపేజీ తరువాయి

2003 మేలో 241, 2004 మేలో 195, 2005 మేలో 188, 2006లో 140గా నమోదయ్యాయి. 2007 నుంచి క్రమంగా తగ్గుతూ వచ్చిన మరణాలు 2016 తర్వాత మళ్లీ తీవ్రమయ్యాయి. 2024 మేలో ఉగ్ర ఘటనల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా.. 2025లో 43మంది మరణించారు.

సామూహిక వివాహాల్లో ఎమ్మెల్యే పెళ్లి.. ఎడ్లబండిపై ఊరేగింపు

కాగా, ఈ ఏడాది మొదటి ఐదు మాసాల్లో ఉగ్రవాద సంబంధిత మరణాలు కేవలం 12 నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ మే నెలలో మాత్రం ఒక్క మరణం కూడా సంభవించలేదన్నారు. జమ్మూ కశ్మీర్‌లో నిరంతరాయంగా కొనసాగుతున్న ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలు.. మెరుగైన నిఘా సమన్వయం కారణంగానే ఈ మార్పు సాధ్యమైందని వారు పేర్కొన్నారు. జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదులకు మద్దతు ఇచ్చేవారు కూడా తగ్గిపోవడంతో ఈ నెట్‌వర్క్ బలహీనపడుతోందన్నారు. క్షేత్రస్థాయిలో ఉగ్రవాద గ్రూపులు తమ సామర్థ్యాలను తిరిగి నిర్మించుకోకుండా భద్రతా దళాలు నిరోధిస్తున్నాయన్నారు. ఈ ముప్పును పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు.

విద్వేషాలు సృష్టించేందుకు వైకాపా కుట్ర: సీఎం చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చే బాధ్యత మాది. గతేడాది యోగాంధ్ర బాగా చేశాం. ఈసారి అమరావతి కేంద్రంగా యోగా కార్యక్రమాలు చేపడతాం. రోజుకు అరగంట వ్యాయామం చేస్తే అనారోగ్యాలు రావు. అందరి జీవన ప్రమాణాలు పెరగాలనేది మా కల. పింఛన్లు ఇంటింటికే వచ్చి అందిస్తున్నాం. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదు. ఏ సమస్యకైనా ఆన్‌లైన్‌లోనే పరిష్కారం చూపుతున్నాం. పీ4 కార్యక్రమం కింద పేదలను ఆదుకుంటున్నాం. రాష్ట్రాభివృద్ధి కోసం పవన్, నేను కలిసి పని చేస్తున్నాం.

డీఎస్సీ నిర్వహించి పోస్టులు భర్తీ చేస్తే వైకాపా ఓర్వలేకపోతోంది. రాష్ట్రాభివృద్ధి చూసి.. ఆ పార్టీకి ఫ్రస్ట్రేషన్ పెరిగిపోతోంది. మత విద్వేషాలు సృష్టించేందుకు కుట్ర పన్నుతోంది. వైకాపా అసత్య ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. నంద్యాలలో వైఎస్ విగ్రహంపై దాడి చేసి.. మాపై నెట్టాలని చూశారు. దాడి చేసిందెవరని ఆరా తీస్తే వైకాపా వాళ్లే చేసినట్లు రుజువైంది. విగ్రహం ధ్వంసం చేశారని అబద్ధాలు చెప్పి.. సానుభూతి కోసం ప్రయత్నించారు. దుర్మార్గాలపై యుద్ధం చేస్తూనే.. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం" అని చంద్రబాబు అన్నారు.

మహారాష్ట్ర సీఎంతో ఏపీ మంత్రి లోకేశ్ భేటీ..

మొదటిపేజీ తరువాయి

ముంబయి: ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో ముంబయిలో భేటీ అయ్యారు. సాదర స్వాగతం పలికిన సీఎంను మంగళగిరి చేనేత శాలువాతో సత్కరించి, శ్రీవారి ప్రతిమను లోకేశ్ అందజేశారు. గణేశ్ ప్రతిమను లోకేశ్‌కు సీఎం దేవేంద్ర బహూకరించారు. ఏపీకి వచ్చిన పెట్టుబడులు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి మహారాష్ట్ర సీఎంకి వివరించారు. ఏపీ విద్యా శాఖలో తీసుకువచ్చిన సంస్కరణలు, స్కిల్ డెవలప్‌మెంట్ విధానాలు తెలియజేశారు. మహారాష్ట్ర ఐటీ, విద్యా శాఖలో అమలవుతున్న అత్యుత్తమ విధానాలు సీఎంను అడిగి తెలుసుకున్నారు.

అంతకుముందు వివిధ దేశాల్లో డేటా సెంటర్లు నిర్వహిస్తున్న హైపర్ స్కేల్ డేటా సంస్థ ఎయిర్ ట్రంక్ సీఈవో రాబిన్ ఖుదాతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖలో ఎయిర్ ట్రంక్ క్యాంపస్ ఏర్పాటు చేయాలని కోరారు. ఏఐ, డేటా హైపర్‌స్కేల్ హబ్‌గా వైజాగ్ ఆవిర్భవిస్తోందని, గూగుల్ ఏఐ హబ్, రిలయన్స్ ఏఐ డేటా సెంటర్లు పురోగతిలో ఉన్నాయని వివరించారు. డేటా సెంటర్ల ఏర్పాటుకు విశాఖ అన్నివిధాల అనుకూలమైనదని మంత్రి చెప్పారు. దీంతో ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని రాబిన్ ఖుదా హామీ ఇచ్చారు.

ఎన్నో పోరాటాల ఫలితమే విశాఖ రైల్వే జోన్:

మొదటిపేజీ తరువాయి

శ్రీకాకుళం: ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల కోరిక.. రైల్వే జోన్ సాకారమైందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ఎన్నో పోరాటాల ఫలితమే దక్షిణ కోస్తా రైల్వే అని తెలిపారు. విశాఖ రైల్వేజోన్ ఏర్పాటుపై ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ వద్ద నిర్వహించిన సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త జోన్ ఏర్పాటుతో లక్షలమంది ప్రయాణికులకు లబ్ధి చేకూరుతుందన్నారు. రైల్వేను అభివృద్ధి చేస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందన్న ఉద్దేశంతోనే కృషి చేసినట్లు చెప్పారు.

"రైల్వే జోన్ కోసం పార్లమెంట్‌లో నిరంతరం మాట్లాడా. ఇచ్ఛాపురం బ్రిడ్జి సమస్యకు కూటమి ప్రభుత్వంలోనే పరిష్కారం లభిస్తుంది. బ్రిడ్జి మాత్రమే కాకుండా అండర్ బ్రిడ్జిపైనా దృష్టి సారిస్తాం. ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌ను రూ.12 కోట్లతో అభివృద్ధి చేస్తున్నాం. ఇచ్ఛాపురం అంటే మూలన ఉండేది కాదు.. ముఖ ద్వారం కాబోతోంది. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుకు ఉత్తరాంధ్ర ప్రజల తరపున ధన్యవాదాలు" అని రామ్మోహన్ నాయుడు అన్నారు.

పేదలకు అత్యధిక పింఛన్లు ఇస్తున్నది కూటమి ప్రభుత్వమే

పాయకరావుపేట గ్రామీణం: దేశంలోనే అత్యధికంగా పేద లబ్ధిదారులకు పింఛన్లుస్తున్నది ఏపీలోని కూటమి ప్రభుత్వమేనని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం సత్యవరం గ్రామంలో సోమవారం హోం మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. గ్రామాల్లో సమస్యలను నేరుగా తెలుసుకునేందుకే ప్రతినెలా పెన్షన్లు పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు మంత్రి వివరించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సమస్యలు, ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు నేతలు గెడ్డం బుజ్జి, కంకిపాటి వెంకటేశ్వరరావు, చించెలుపు పద్దు, యాళ్ల వరహాల బాబు, వడ్డాది వాసు, బొలిశెట్టి [redacted]గేశ్వరరావు, గూటూరు శ్రీనివాసరావు, కేరి పాల్గొన్నారు.

చెరువు 'కబ్జాల'పై లేని ప్రతాపం.. పేదల గుడిసెలపైనేనా?

-గోపాలపురం చెరువులో తెల్లవారుజామునే 120 గుడిసెల కూల్చివేత.

-కన్నీరుమున్నీరవుతున్న బాధితులు.. రోడ్డున పడ్డ బతుకులు

-అక్రమ కట్టడాలు వదిలేసి.. పేదల పొట్టకొడతారా

హనుమకొండ జిల్లా జూన్ 1 న్యూస్

అధికార గద్దెనెక్కినప్పుడు 'ప్రజా పాలన' అని ఊదరగొట్టిన పాలకులు.. క్షేత్రస్థాయిలో మాత్రం పేదలపైనే తమ ప్రతాపం చూపిస్తున్నారు. హనుమకొండ పరిధిలోని గోపాలపురం చెరువు శిఖం భూముల్లో నిర్మించుకున్న పేదల గుడిసెలను సోమవారం సూర్యోదయానికి ముందే రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు పోలీసుల సాయంతో బలవంతంగా నేలమట్టం చేశారు. ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా, కనీసం సామాగ్రి సర్దుకునేందుకు ఒక్క రోజు సమయం ఇవ్వాలని బాధితులు కాళ్ళు పట్టుకుని బతిలాడినా వినకుండా 120 గుడిసెలను జేసీబీలతో కూల్చివేశారు. ఐదేళ్లుగా ఇక్కడే నివాసముంటున్న తమను ఎండనక, వాననక గుడిసెలు పీకేసి రోడ్డున పడేశారని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు.

కబ్జాదారులకు కొమ్ముకాస్తూ.. పేదలపై జేసీబీలా?

గోపాలపురం చెరువు రికార్డుల ప్రకారం సర్వే నంబర్ 89 మొత్తం 21 ఎకరాల 3 గుంటలు ఉండాలి. కానీ, రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల అండతో ఇప్పటికే ఇందులో సుమారు 10 ఎకరాల వరకు కబ్జాకు గురైంది. చెరువును ఆక్రమించి నిర్మించిన భారీ అక్రమ కట్టడాలకు అధికారులు గతంలో మార్కింగ్ (గుర్తులు) చేసినప్పటికీ.. వాటిని ముట్టే ధైర్యం చేయడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

చెరువు సుందరీకరణ పేరుతో హడావుడి చేస్తున్న యంత్రాంగం.. మొదట చెరువు భూమిని పూర్తిగా సర్వే చేయించి హద్దురాళ్ళు ఎందుకు వేయడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్రమ కట్టడాలను కూల్చకుండా కేవలం పేదల గుడిసెలను తొలగించి నామమాత్రంగా చేతులు

దులుపుకోవడం వెనుక ఉన్న అంతర్యం ఏమిటని ' సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వి వీరన్న ప్రశ్నించారు ఉన్న చెరువును సుందరీకరించి కబ్జాదారులకు సపోర్ట్ చేయడానికే ఈ డ్రామా ఆడుతున్నారా? అని నిలదీస్తున్నారు చెరువు కట్ట లోపల సైడ్ డ్రాప్ ఆల్ కట్టి హైట్ పెంచి ముందున్న పోచమ్మ గుడి ఏరియా టిఎన్ జీవోస్ కాలనీ పరిమళ కాలనీ రేణుక ఎల్లమ్మ కాలనీ ట్రాన్స్ఫార్ పక్కన దళిత కాలనీ వాటరు వడ్డేపల్లి నుండి తీసుకువచ్చి ఇందులో పడేయడం వల్ల ఈ ప్రాంతమంతా మునిగి ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంది వాటర్ ఫ్లో పైనుండి బాగా పెరిగిన ఈ కట్టకు మధ్యలో మోరిని నిర్మించాలి కానీ అధికారులు పట్టించుకోవట్లేదు స్మశాన వాటికలను అన్నిటిని మట్టి పోసి మూసి వేస్తున్నారు ఇదెక్కడి న్యాయం

ఎలక్షన్లప్పుడు ఓట్లు కావాలి.. ఇప్పుడేమో రోడ్డున పడేస్తారా?

మూల రమాదేవి (బాధితురాలు)

గత ఐదు సంవత్సరాల నుండి ఇక్కడే వరదలకు, వర్షాలకు, విషప్రాణులకు తట్టుకుంటూ గుడిసెలు వేసుకొని బతుకుతున్నాం. గత ఏడాది తుఫానుకు సర్వస్వం కోల్పోతే, మళ్లీ అప్పులు చేసి రేకులు కొనుక్కున్నాం. 'మాకు ఒక్కరోజు టైం ఇవ్వండి, ఇవన్నీ తీసి పక్కన పెట్టుకుంటాం' అని అధికారులను బతిలాడినా వినలేదు. వేరే ఎక్కడైనా వేసుకోకుండా ఉండటానికి రేకులను, కర్రలను కూడా జేసీబీలతో విరగ్గొట్టారు."

మా బతుకులు రోడ్డున పడ్డాయి.

ఎండి బిల్గేస్ (బాధితురాలు)

ఇప్పుడు మా బతుకులు రోడ్డు మీద పడ్డాయి. మమ్ములను ఆదుకునే నాథుడే లేడు. ఇంట్లో నలుగురం ఉన్నాం.. ఈ మండుటెండల్లో ఎక్కడ ఉండాలి? ఏం వండుకుని తినాలి? ప్రజా పాలనలో అనేకసార్లు దరఖాస్తు ఇచ్చాను. ఎమ్మెల్యే ని కూడా కలిశాను. ఎలక్షన్ల టైంలో ఎంపీ కవిత మాకు ఇందిరమ్మ పథకం కింద ఇల్లు ఇస్తామని మాట ఇచ్చారు. ఓట్ల కోసం మా దగ్గరకు వచ్చిన ఏ రాజకీయ నాయకుడూ 'ఇది చెరువు భూమి, ఇక్కడ ఉండొద్దు' అని చెప్పలేదు. ఓట్లేమో మావి కావాలి.. గెలిచాక మా బతుకులను రోడ్డున పడేస్తారా? మా ఉసురు తలుగుద్ది ఈ ప్రభుత్వానికి మట్టి అమ్ముకొని కోట్లు గడిస్తున్నారు

తక్షణమే న్యాయం చేయాలి!

ఎవీరన్న నాయక్

సిపిఎం జిల్లా నాయకులు

సుందరీకరణ పేరుతో పేదలను ఇక్కడి నుండి వెళ్లగొట్టడం అన్యాయమని, అక్రమ కట్టడాలపై లేని ప్రతాపం పేదలపై చూపించడం ప్రభుత్వ ద్వంద్వ నీతికి అద్దం పడుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, చెరువు భూమిని పూర్తిస్థాయిలో సర్వే చేయించి కబ్జాదారుల నుండి భూమిని స్వాధీనం చేసుకోవాలని.. అలాగే ఇండ్లు కోల్పోయి రోడ్డున పడ్డ 120 పేద కుటుంబాలకు తక్షణమే ఇందిరమ్మ ఇండ్లు లేదా ప్రత్యామ్నాయ నివాస వసతి కల్పించాలి. గుడిశవాసులతో హనుమకొండ కలెక్టర్ ఆఫీస్ ముందు నిరసన తెలియజేయడం జరిగింది అధికారులకు మెమోరాండం ఇవ్వడం జరిగింది ప్రభుత్వము పేదలను ఆదుకోకపోతే ఇండ్లు వచ్చేవరకు పోరాడదాం అని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు వి రాజు డి రమేష్ ప్రజా సంఘాల నాయకులు సబిత పావని పద్మ మమత శృతి రమాదేవి సమ్మయ్య రమేష్ వెంకటేష్ పాల్గొన్నారు

ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు: అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

•కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 122 దరఖాస్తుల స్వీకరణ

•ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా దరఖాస్తులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశం

మన మహాతి న్యూస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జూన్ 01

ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు జాప్యం లేకుండా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు.

సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డీఆర్ఓ మాలతి, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి ఆయన జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 122 దరఖాస్తులను స్వీకరించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ప్రజలు వ్యయప్రయాసలతో అధికారుల వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణిలో అందిన అర్జీలను వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు.

అలాగే, తిరస్కరించే దరఖాస్తుల విషయంలో తిరస్కరణకు గల కారణాలను స్పష్టంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు ఆదేశించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తిరువూరు లో సబ్ రిజిస్టర్ కార్యాలయం అధికారి ఎవరో తెలియక - ప్రజలు అయోమయం - పరిపాలనపై ప్రజల ప్రశ్నల వర్షం

•సమగ్ర విచారణకు రెవెన్యూ డివిజనల్ అధికారికి ఫిర్యాదు

•అసలైన సబ్ రిజిస్టర్ ఎవరు ప్రజల సందేహాలు ?

మన మహతిప్రతినిధి:భ్రమరాంబ తిరువూరు న్యూస్:జూన్.2

తిరువూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో జరిగిన హై డ్రామా పై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ సోమవారం తిరువూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేసిన పాత్రికేయులు!

ఎన్‌టీఆర్ జిల్లా తిరువూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు ప్రజల్లో తీవ్ర చర్చకు దారితీశాయి!

అవినీతి ఆరోపణల నేపథ్యంలో బదిలీ అయిన మాజీ సబ్‌రిజిస్ట్రార్ తిరిగి అదే కార్యాలయానికి వచ్చి విధులు నిర్వహిస్తున్న అధికారిక సబ్‌రిజిస్ట్రార్ సీటులో కూర్చొని తాను మళ్లీ పోస్టింగ్ పొందినట్లు ప్రకటించడం వివాదానికి కేంద్రబిందువైంది!

అయితే ఇందుకు సంబంధించిన అధికారిక బదిలీ లేదా పోస్టింగ్ ఉత్తర్వులు ప్రజలకు అందుబాటులో లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది! అప్పటికే మరొక అధికారి ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు విధులు నిర్వహిస్తున్న సమయంలో

ఈ పరిణామం! చోటుచేసుకోవడంతో ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థ,ఉత్తర్వుల అమలు విధానం,కార్యాలయ క్రమశిక్షణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి!

ఈ ఘటన కారణంగా కార్యాలయ ప్రతిష్ఠ దెబ్బతినడమే కాకుండా రిజిస్ట్రేషన్ సేవల కోసం వచ్చే ప్రజలు అయోమయానికి గురవుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు!

అసలు ఏ అధికారి చట్టబద్ధంగా విధుల్లో ఉన్నారు ?

బదిలీ అయిన అధికారి తిరిగి కార్యాలయంలోకి ఎలా ప్రవేశించారు ?

అధికారిక ఉత్తర్వులు ఉన్నాయా లేదా ?

అనే అంశాలపై స్పష్టత కోరుతున్న సబ రిజిస్టర్ కార్యాలయానికి విచ్చేసిన బాధ్యత ప్రజలు!

ఈ నేపథ్యంలో తిరువూరు రెవిన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ)కు ఫిర్యాదు అందింది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన పరిణామాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని ఫిర్యాదుదారులు కోరుతున్నారు!

అలాగే నిబంధనల ఉల్లంఘన జరిగి ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు!

ప్రభుత్వ వ్యవస్థపై ప్రజల విశ్వాసం నిలబెట్టేందుకు జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని పారదర్శక విచారణ చేపట్టాలని

డిమాండ్ చేస్తున్న ప్రజలు.

మృతుడు కండక్టర్ శంకర్ కుటుంబాన్ని పరామర్శించిన మిత్ర బృందం లావుడియా రాజు నాయక్, రఘుపతి,రాజయ్య, రవి, రాజేశ్వరరావు ,శ్రీనివాస్, సునీత శ్రీలత మాధవి.

హనుమకొండ జిల్లా జూన్1 న్యూస్

పరకాల డిపోకు చెందిన కండక్టర్ శంకర్ విధి నిర్వహణలో భాగంగా పరకాల డిపో నుండి బస్సు బయలుదేరి భద్రాచలం వెళ్ళినాది. తిరుగు ప్రయాణంలో భద్రాచలం నుండి పరకాలకు వస్తుండగా మార్గమధ్యంలో ఇల్లందు క్రాస్ వద్ద బస్సులో కండక్టర్ శంకర్ ఒక్కసారిగా తీవ్ర అస్వస్థకు గురై సీటులోనే కుప్పకూలిపోయాడు. వెంటనే బస్సును నిలిపివేసి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోకి చేర్పించడం జరిగింది. వైద్యులు పరిశీలించిన అనంతరం అప్పటికే మృతి చెందినట్లుగా ధ్రువీకరించారు.

కాగా ఈరోజు ములుగు జిల్లా వెంకటాపూర్ మండల్ లక్ష్మీదేవి పేట వారి స్వగృహంలో మృతి చెందిన కండక్టర్ శంకర్ భార్యయగు సౌందర్య యొక్క చిన్ననాటి పదవ తరగతి 1994-95మిత్రులు ఈరోజు కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చడం జరిగింది. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్ననాటి మిత్రులైన లావుడియా రాజు నాయక్, దుంద్ర రాజయ్య, గూడెపు రఘుపతి,మాకోటి శ్రీనివాస్,లింగంపల్లి రాజేశ్వరరావు, జన్ను సుధాకర్ గుడికందుల శంకర్, మూడెత్తుల రవి,ప్రసాద్ రావు,తులాల సునీత, చాడ మాధవి, కందకట్ల శ్రీలత, బంధుమిత్రులు ఆర్టీసీ డిపార్ట్మెంట్ తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసాని గిరిజన గురుకుల ప్రతిభా కళాశాల విద్యార్థుల సత్తా

పాల్వంచ రూరల్ జూన్ 1, మన మహతి న్యూస్

ఈ సంవత్సరం నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (అడ్వాన్స్‌డ్)-2026 ఫలితాల్లో కిన్నెరసాని గిరిజన గురుకుల ప్రతిభా కళాశాలకు చెందిన గిరిజన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి రికార్డు సృష్టించారు.

కళాశాల విద్యార్థి డి. సిద్దు గిరిజన విభాగంలో 475వ ర్యాంకు సాధించాడు. మరో విద్యార్థి జి. రోహిత్ 1380వ ర్యాంకుతో కళాశాల నుంచి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు.

డి. సిద్దు, ఎస్టీ కేటగిరి లో ఆల్ ఇండియా ర్యాంక్ 475

కళాశాల నుంచి 07 మంది విద్యార్థులు ఉమ్మడి ప్రవేశ పరీక్ష (అడ్వాన్స్‌డ్) రాయగా, అందులో ఇద్దరు అర్హత సాధించి భారతీయ సాంకేతిక విద్యా సంస్థలకు ఎంపికయ్యారు. గురుకులాల చరిత్రలో ఇది అత్యుత్తమ ఫలితంగా నిలిచింది.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ గొగ్గేల రమేష్ మాట్లాడుతూ, విద్యార్థుల పట్టుదల, అధ్యాపకుల కృషి వల్లనే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని అన్నారు. విజేతలను గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, ప్రాంతీయ సమన్వయకర్త అరుణ కుమారి అభినందించారు. తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

జి రోహిత్ , ఎస్ కేటగిరి లో ఆల్ ఇండియా ర్యాంక్ 1385

జిల్లాలో పోలీస్ 30 యాక్ట్ అమలు

మన మహాతి. న్యూస్ ప్రతినిధి.

నారాయణపేట జిల్లాలో ఇవాల్టి నుంచి నెల రోజులపాటు పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉంటుందని ఎస్పీ డాక్టర్ వినీత్ సోమవారం ప్రకటనలో తెలిపారు. పోలీసుల అనుమతులు లేకుండా రాజకీయ పార్టీలు, యువజన, కార్మిక, రైతు సంఘాలు సభలు, సమావేశాలు, బహిరంగ సభలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారాదని చెప్పారు. సోషల్ మీడియాలో మతాలు, ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు పెట్టరాదని హెచ్చరించారు.

ఉద్యమ పోరాటాల ఫలితమే నేటి తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం....

•తెలుగు ఉపన్యాసకులు,సామాజిక వేత్త బిజ్వార్ మహేష్ గౌడ్.

మన మహతి.న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం.

ఆరు దశాబ్దాల కాలంగా మూడు దశలలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో పాలకుల స్వార్థ రాజకీయాలకు అన్నింటిలో వివక్షతకు గురి కావడంతో తెలంగాణ ప్రజలు ఉద్యమాలను చేపట్టగా ఎంతో మంది ప్రాణ త్యాగాలు,పోరాటాల ఫలితమే నేడు మనం జరుపుకుంటున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం అని తెలుగు ఉపన్యాసకులు,సామాజికవేత్త బిజ్వార్ మహేష్ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.యావత్ తెలంగాణ ప్రజలకు నేడు జరుపుకుంటున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి నేటితో 12 ఏండ్లు పూర్తిచేసుకుని 13 వ సంవత్సరంలోకి అడుగుపెడుతోందని సరిగ్గా ఇదే రోజు 2014 జూన్ 2న దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించిందని తెలిపారు.1960 నుంచి 2014 వరకు పలు దశలలో జరిగిన తెలంగాణ ఉద్యమాల్లో వందలాది మంది ప్రాణ త్యాగాలు చేశారని,భాషా ప్రాతిపదికన 1956 లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడే సమయంలో అందులో భాగమైన తెలంగాణ ప్రాంతం 58 ఏళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్ నుండి విడిపోయి

ప్రత్యేకంగా ఏర్పడిందని అయితే ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రధానంగా మూడు దశలు కనిపించాయని 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడే సమయంలోనే ఆంధ్రప్రదేశ్ లో తమ ప్రాంతాన్ని కడప వద్దని అప్పట్లోనే వ్యతిరేకత వినిపించడం మొదటి దశ అని,ఇక 1960లో ముల్కీ నిబంధనలను ఉల్లంఘించినందుకు అప్పుడు ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమం రెండో దశగా చెప్పుకోవచ్చన్నారు.ఇక 1990 ల తర్వాత కనిపించిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం మూడో దశగా చెప్పవచ్చని మూడో దశలో జరిగిన తెలంగాణ ఉద్యమం కీలకంగా మరిందన్నారు. అధికారంలో సరైన ప్రాధాన్యత,నిధుల కేటాయింపుల్లో వివక్షత, ప్రాంతీయ వెనుకబాటుతనం ఈ మూడు అంశాలు ప్రధాన కారణంగా నిలిచాయన్నారు.నీళ్లు, నిధులు,నియామకాలు అనే నినాదంతో 2009లో నవంబర్ 29న నాటి సీఎం కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్షతో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడిందని చెప్పడంలో సందేహం లేదన్నారు.ఈ ఉద్యమం ప్రజలలో రాష్ట్ర సాధన ఆకాంక్షను మరింత బలోపేతం చేసి సబ్బండ వర్గాలు ఉద్యమించేలా చేసిందన్నారు.అంతేకాక విద్యార్థులు,ఉద్యోగులు, నిరుద్యోగులు,సామాన్య ప్రజలు అంతా ఒకటై 'జై తెలంగాణ' అనే నినాదంతో ముందుకు సాగారని,పలు రకాల కార్యక్రమాలతో ఉద్యమ వేడిని కొనసాగించారని దాంతో 2010లో శ్రీకృష్ణ కమిటీ ఏర్పాటై ఆరు ప్రతిపాదనలు చేసిందన్నారు.తదనంతరం 2013 జూలై 30న ప్రత్యేక తెలంగాణ కోసం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం చేయగా 2013 అక్టోబర్ 3న మంత్రిమండలి ఆమోదం తెలిపిందని 2014 ఫిబ్రవరి 18 న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లు లోక్సభలో ఫిబ్రవరి 24 రాజ్యసభలో ఆమోదం పొందిందని అనంతరం మార్చి ఒకటిన రాష్ట్రపతి సంతకం చేశారని దాంతో 2014 జూన్ 2 వా తేదీన దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం నూతనంగా అవతరించిందని తెలిపారు.

గేదెల షెడ్డులో బీహార్ యువకుడి ఆత్మహత్య - చనిపోతున్న అంటూ - ముందుగానే అన్న కు ఎందుకు?ఫోన్ చేశాడు

•17-వ తేదీ స్థానిక రైతు వద్ద పనికి కుదిరిన ఈ వ్యక్తి!

•అకస్మాత్తుగా 31, వ తారీకు ఎందుకు చనిపోయాడు?

•ఈ ఆత్మహత్య వెనుక ఉన్న కారణాలు ఏమిటి?

మన మహతిప్రతినిధి:భ్రమరాంబ

విస్సన్నపేట న్యూస్,జూన్.2

విస్సన్నపేట మండలం తాతకుంట్ల గ్రామంలో ఒక యజమానికి సంబంధించిన గేదెల షెడ్డులో బీహార్ యువకుడి ఆత్మహత్య!తిరువూరు విస్సన్నపేటస్థానిక మండల పరిధిలోని తాతకుంట్ల గ్రామంలో ఓ గేదెల షెడ్డులో పని చేస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు,గ్రామస్తులు తెలిపిన వివరాల

ప్రకారం.బీహార్ రాష్ట్రం,పాట్నా జిల్లా, దినాపూర్ మండలం, సుల్తానాపూర్ గ్రామానికి చెందిన సతీందర్ యాదవ్ కుమారుడు బంటి కుమార్ (26) గతంలో నెల్లూరు ప్రాంతంలో పనిచేసేవాడు. కాగా.ఈ ఏడాది మే 15,వ తేదీన అతడు తాతకుంట్ల గ్రామానికి వచ్చాడు. మే 17,వ తేదీ నుండి స్థానిక రైతు వడ్లమూడి చెన్నారావుకు చెందిన గేదెల షెడ్డులో నెలకు రూ. 20,000,జీతంపై పనిలో చేరాడు.అన్నకు ఫోన్ చేసి చనిపోతున్నా అంటూ.మే,31 (ఆదివారం) రాత్రి సుమారు 10:00 గంటల సమయంలో బంటి కుమార్ తన బంధువులతో ఫోన్లో మాట్లాడాడు. అదే సమయంలో హైదరాబాద్లో నివసిస్తున్న తన అన్న దీపక్కు కూడా ఫోన్ చేసి,తాను ఉరివేసుకొని చనిపోతున్నట్లు చెప్పినట్లు సమాచారం. ఈ ఆత్మహత్య వెనుక ఉన్న కారణమేమిటి ?కాగా,జూన్ 1 (సోమవారం) ఉదయం అతడు నివసిస్తున్న రేకుల షెడ్డు తలుపులు తెరిచి చూడగా,లోపల బంటి కుమార్ ఉరివేసుకొని మృతి చెంది కనిపించాడు.విచారణలో పోలీసులుసమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం విస్సన్నపేట ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి (సి.హెచ్.సి)కు మృతుడి బంధువులకు సమాచారం అందించామని,వారు ఇచ్చే ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి తదుపరి విచారణ జరుపుతామని వెల్లడించిన పోలీసులు. మరికొన్ని నిజాలు మరోచంచికలో

నాణ్యమైన విద్యకు కొత్త చిరునామా -- సంగారెడ్డిలో క్రుపానిధి కృష్ణవేణి హై స్కూల్.

సంగారెడ్డి,జూన్ 01,మన మహతి న్యూస్ :

నాణ్యమైన విద్యతో పాటు విలువలను విద్యార్థుల్లోపెంపొందించాలనే లక్ష్యంతో క్రుపానిధి కృష్ణవేణి హై స్కూల్ సంగారెడ్డిలో తన విద్యా సేవలను ప్రారంభించింది. ఆధునిక మౌలిక సదుపాయాలు, విశాలమైన తరగతి గదులు, విద్యార్థులకు అనుకూలమైన అభ్యాస వాతావరణంతో ఈ విద్యాసంస్థ విద్యా రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందే దిశగా ముందుకు సాగుతోంది. రాబోయే విద్యా సంవత్సరానికి నర్సరీ నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు పాఠశాల యాజమాన్యం ప్రకటించింది. విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపింది.ప్రత్యేక కార్యక్రమంగా, తల్లిదండ్రుల కోసం ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులను కూడా నిర్వహిస్తోంది. దీనివల్ల వారు తమ కమ్యూనికేషన్

నైపుణ్యాలనుమెరుగుపరుచుకుని, పిల్లల విద్యాభివృద్ధిలో మరింత చురుకుగా భాగస్వాములు కావచ్చని యాజమాన్యం పేర్కొంది.అనుభవజ్ఞులైన,అంకితభావం కలిగిన ఉపాధ్యాయ బృందం ద్వారా ఆధునిక బోధనా విధానాలను అమలు చేస్తూ, ఉన్నత ప్రమాణాల విద్యను అందించేందుకు సంస్థ కట్టుబడి ఉందని యాజమాన్యం వెల్లడించింది. సమగ్ర అభివృద్ధి, క్రమశిక్షణ, విద్యా ప్రతిభకు ప్రాధాన్యతనిస్తూ క్రుపానిధి కృష్ణవేణి హై స్కూల్ సంగారెడ్డిలో ఉత్తమ పాఠశాలలలో ఒకటిగా ఎదుగుతోంది.2026--27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లుకొనసాగుతున్నాయి. ఆసక్తి గల తల్లిదండ్రులుపాఠశాలను సందర్శించి, అందుబాటులో ఉన్న విద్యా కార్యక్రమాలు మరియు సౌకర్యాల గురించి మరింత సమాచారం తెలుసుకోవాలని యాజమాన్యం సూచించింది.

లింగంపల్లి లో విజయవంతమైన ఉచిత కంటి వైద్య శిబిరం..

మన మహాతీ న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం.

తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి సహకారంతో, వాకిటి శ్రీహరి అన్న సేవా సమితి, పాలమూరు రాంరెడ్డి కంటి ఆసుపత్రి, లింగంపల్లి సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల సహకారంతో... సోమవారం గ్రామంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైందని వాకిటి శ్రీహరి అన్న సేవా సమితి వ్యవస్థాపకులు అల్కూరి రవికుమార్ తెలిపారు. మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, కట్టా సురేష్ గుప్తా, లింగంపల్లి సర్పంచ్



ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభించగా... సుమారు 100మంది వరకు ఉచిత కంటి పరీక్షలు చేపట్టగా.. దాదాపు 40 మంది వరకు శస్త్ర చికిత్స కోసం రాంరెడ్డి కంటి ఆసుపత్రి కి తరలించామని అన్నారు.

వాకిటి శ్రీహరి అన్న సేవాసమితి ఆధ్వర్యంలో ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా చాలా గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, వేలాది మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేపట్టామని చెప్పారు. సహకరించిన మంత్రి వాకిటి శ్రీహరికి లబ్దిదారులు ధన్యవాదాలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహమ్మద్ షాలమ్, కావలి రాజేందర్, లింగంపల్లి ఉపసర్పంచ్, వార్డు సభ్యులు , వైద్య సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు

వెంపాటి హన్విక పుట్టినరోజు సందర్భంగా భగవాన్ శ్రీ రమణ మహర్షి ఆశ్రమంలో - రైస్ బ్యాగ్ మరియు నిత్యవసర సరుకులు - వితరణ

మన మహతిప్రతినిధి:బ్రమరాంబ తిరువూరు న్యూస్,జూన్. 2

ఎన్టీఆర్ జిల్లా తిరువూరు పట్టణంలో శ్రీరమణ మహర్షి ఆశ్రమంలో దాతలు వితరణ పాత కొండూరు గ్రామానికి చెందిన వెంపాటి కిషోర్ సంధ్య దంపతుల ముద్దుల తనయ హన్విక పుట్టినరోజు సందర్భంగా హెల్పింగ్ హాండ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో మానవ సేవే మాధవ సేవగా ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అని తమ వంతు సహాయంగా పట్టణ పరిధిలోని జన్మభూమి రోడ్ లో గల భగవాన్ శ్రీ రమణ మహర్షి అంధులు మానసిక వికలాంగులు అనాధ బాలల సేవా ఆశ్రమం లో రైస్ బ్యాగ్,నిత్యవసర సరుకులు,కూరగాయలు,పళ్ళు పలహారాలు ఆశ్రమ నిర్వాహకులు వెంపాటి అబ్రహం మణిరత్నం కు వితరణగా అందజేశారు.

ఆశ్రమ నిర్వాహకులు అబ్రహం మణిరత్నం చిన్నారి హన్విక కు ప్రత్యేక ప్రార్థన నిర్వహించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వెంపాటి కిషోర్,పొద్దుటూరి హర్ష,వెంపాటి రాజు,హెల్పింగ్ హాండ్స్ గ్రూప్ – సమైక్య ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మద్దిబోయిన నరేష్,మాదాసు టైటాస్ (సామాజిక కార్యకర్త)

ఆళ్ల నారాయణ పాల్గొన్నారు.

పేద కుటుంబలా సొంతింటి . కలను సహకారం చేయడమే. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

మన మహతి. న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం.

రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో భాగంగా మాగనూర్ మండలంలో... తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాపంగా నిర్మించిన ఇంద్రమ్మ ఇల్లు ప్రారంభోత్సవం లో భాగంగా సోమవారం. మాగనూరు మండలంలో వివిధ గ్రామాలలో మాగనూర్ అచ్చంపేట్ మరియు నే డగం దొడ్డి గ్రామంలో అధికారికంగా ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించిన ఎంపీడీఓ శ్రీనివాస్ , హౌసింగ్ ఏ ఈ సాయి కార్తీక్ , పంచాయతీ కార్యదర్శి తిమ్మప్ప ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, సర్పంచ్ తనయుడు సత్యనారాయణ, మాజీ మక్తల్ వ్యవసాయ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్ ,ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు చక్ర పాణి రెడ్డి, ముష్టి లక్ష్మయ్య యాదవ్, లబ్ధిదారులు, గ్రామస్తులు గృహప్రవేశం చేసిన కార్యక్రమంలో ఉన్నారు... అదేవిధంగా మాగనూర్ మండలంలో నీ నేడుగం దొడ్డి గ్రామాలలో 5 ఇళ్లను గృహప్రవేశంలో పాల్గొన్న నేరడగం దొడ్డి సర్పంచ్. వెంకటేష్ పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాస్ , ఇంద్రమ్మ కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు..

మైనర్ బాలిక అశ్విని ఆత్మహత్యకు కారణం అయిన వాళ్ళని కఠినంగా శిక్షించాలని...

విశ్వహిందూ.పరిషత్,బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఎస్పై కు వినతి పత్రం అందజేత.

మన మహతి.న్యూస్ ప్రతినిధి.

నారాయణపేట జిల్లాలో అశోక్ నగర్ కాలనీ లో నివసిస్తున్న మైనర్ బాలిక అశ్వినిను ప్రేమా ప్రేరూ తో లవ్ జిహాద్ వాళ్ళు లో వేసుకుని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేయడంతో అమ్మాయి సూసైడ్ చేసుకోవడం

ఈ ఘటనకు కారణమైన వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పోలీసు అధికారులను డిమాండ్ చేస్తున్నాము. దర్యాప్తును వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించి నిజానిజాలను వెలికితీయాలని కోరుతున్నాము.

సమాజంలో లవ్ జిహాద్ కి ఎంతో మంది హిందూ అమ్మాయిలు గురవుతున్నారు, కావున పోలీస్ శాఖ వారు వీటిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుకుంటునము అలాగే బాధిత కుటుంబానికి అవసరమైన సహాయం, రక్షణ మరియు న్యాయం అందేలా పోలీస్ లు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు నారాయణపేట జిల్లా బజరంగ్ దళ్ కో-కన్వీనర్ భీమేష్,ప్రఖండ సంయోజక్ రాహుల్, మూర్తి, గోరక్ష ప్రముఖ్ అనిల్,శ్రీను,లింగం బజరంగ్ దళ్ కార్యకర్తలు ఇతరతులు పాల్గొన్నారు

మీ పత్రిక కోసం సంక్షిప్తంగా, వార్తా శైలిలో ఇలా రాయవచ్చు:

•తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు సర్వం సిద్ధం.

సంగారెడ్డి, జూన్ 01,మన మహతి న్యూస్ : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జూన్ 2న జరిగే వేడుకల నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌ను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్, భద్రతా ఏర్పాట్లు, ఇతర సదుపాయాలను పరిశీలించారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో జరిగే పరేడ్ ఆకర్షణీయంగా,గౌరవప్రదంగా ఉండేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

కవాతులో పాల్గొనే ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తమ క్రమశిక్షణ, వృత్తి నైపుణ్యాన్ని ప్రతిబింబించేలా వ్యవహరించాలని ఎస్పీ ఆదేశించారు.విధుల నిర్వహణలో ఎలాంటి అలసత్వానికి తావు ఇవ్వకుండాబాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి పరేడ్ రిహార్సల్స్‌ను పరిశీలించి, పరేడ్ కమాండర్‌తో పాటు పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం.

•ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న జిల్లా ఎస్పీ.

•ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్.హెచ్.ఓలకు సూచనలు.

సంగారెడ్డి, జూన్ 01,మన మహతి న్యూస్ : ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సమస్యలతో వచ్చిన ఫిర్యాదుదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను ఓపికగా విని, సంబంధిత అంశాలపై స్థానిక ఎస్.హెచ్.ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్‌లలో సమస్యలు పరిష్కారం కాకపోయిన పక్షంలో ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. అలాగే మధ్యవర్తులను నమ్మకుండా తమ సమస్యలను నేరుగా పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదును జిల్లా పోలీసు కార్యాలయం నుంచి నిరంతరం మానిటరింగ్ చేస్తూ సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

కీసర పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సీపీ సుమతి

•ప్రజలకు వేగవంతమైన సేవలందించేందుకు సాంకేతికత వినియోగంపై దిశానిర్దేశం

•విధుల నిర్వహణలో మరింత చురుకుదనం ప్రదర్శించాలని సిబ్బందికి ఆదేశాలు

మన మహతి న్యూస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర జూన్ 01

మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి సోమవారం కీసర పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్‌లోని సీసీ కెమెరాల పనితీరు, పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, వివిధ విభాగాల పనితీరును పరిశీలించారు. అనంతరం క్రైమ్, రిసెప్షన్ తదితర విభాగాల సిబ్బందితో సమావేశమై విధుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు.

ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించాలని సిబ్బందికి సూచించారు. అలాగే ఎన్ పి డి ఎస్ కేసుల దర్యాప్తు, మీ సురక్ష యాప్ వినియోగం, ప్రజల భాగస్వామ్యం పెంపు, వివరాల నవీకరణ వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు. స్టేషన్ ఆవరణ పరిశుభ్రత, పచ్చదనంపై సీపీ సంతృప్తి వ్యక్తం చేస్తూ, విధుల నిర్వహణలో మరింత చురుకుదనం ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కీసర ఇన్‌స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు, ఎస్ఐలు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం తో నెరవేరుతున్న పేదల సొంతింటి కల.

•టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి.

సంగారెడ్డి, జూన్ 01,మన మహతి న్యూస్ : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం తో పేదల చిరకాల వాంఛ అయిన సొంతింటి కల నెరవేరుతుందని టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. సోమవారం కంది మండలం కవలంపెట్ లో లబ్ధిదారులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం లో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భం గా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యం లో అమలుచేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా రాష్ట్రం లో పేదల సొంతిటి కల నెరవేరుతుందని అన్నారు. సంగారెడ్డి జిల్లాకు మరో పదివేల ఇందిరమ్మ ఇళు మంజూరు కావడం సంతోషకరమన్నారు. ఇందిరమ్మ ఇంటి కోసం ఇప్పటికీ దరఖాస్తు చేసుకోని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ జూలకంటి ఆంజనేయులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రామ్ చందర్ నాయక్, కవలంపేట సర్పంచ్ కుమ్మరి స్వాతి శ్రీశైలం, కంది మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

అశోక్ నగర్ కాలనీ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం: సర్పంచ్ జర్పల దేవి

మన మహతి న్యూస్ లక్ష్మీదేవిపల్లి

లక్ష్మీదేవిపల్లి మండలం అశోక్ నగర్ కాలనీ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సిపిఐకి చెందిన సర్పంచ్ జర్పల దేవి, పంచాయతీ కార్యదర్శి చింతల ప్రవీణ్ కుమార్ కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ పథకాల ద్వారా పేద కుటుంబాల సొంతింటి కల సాకారమవుతోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.

కార్యక్రమంలో ఉప సర్పంచ్ చలమల సంధ్య, వార్డు సభ్యులు, లబ్ధిదారులు మిట్టపల్లి శిరీష, ధారావత్ స్రవంతి, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో అర్హులైన కుటుంబాలకు శాశ్వత నివాస సౌకర్యం కల్పించబడుతోందని, దీంతో వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన కలెక్టర్



మన మహతి న్యూస్ ప్రతినిధి.

నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్మాణాలు పూర్తయిన మూడు ఇందిరమ్మ ఇండ్లను సోమవారం కలెక్టర్ సీహెచ్ ప్రియాంక ప్రారంభించారు. 3 వ వార్డులో ఉజ్జెల్లీ నర్సమ్మ, 4వ వార్డులో వరలక్ష్మి, 9వ వార్డులో దాసరి కమల శ్రీ లకు చెందిన ఇందిరమ్మ ఇండ్లను కలెక్టర్ ప్రారంభించారు. లబ్ధిదారులు కలెక్టర్తో పాటు అతిథులను శాలువాతో సన్మానించారు. లబ్ధిదారులకు కలెక్టర్ శుభాకాంక్షలు చెప్పారు. చైర్ పర్సన్ శ్వేత పాల్గొన్నారు.

తూంకుంట రైతులకు రూ.157 కోట్ల పరిహార చెక్కులు అందజేసిన కలెక్టర్ మను చౌదరి

•రెండో విడతలో రైతులకు కలెక్టర్ మను చౌదరి చెక్కుల అందజేత

•సికింద్రాబాద్--శామీర్‌పేట్ ఎలివేటెడ్ కారిడార్ కోసం భూముల స్వాధీనం

మన మహతి న్యూస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జూన్ 01

సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట్ వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన తూంకుంట గ్రామ రైతులకు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సోమవారం పరిహార చెక్కులు అందజేశారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి రెండో విడతగా 19,726.5 చదరపు గజాల భూమికి సంబంధించిన రైతులకు రూ.157 కోట్ల చెక్కులు పంపిణీ చేశారు. మిగిలిన అర్హులకూ త్వరలో చెక్కులు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. భూములకు చదరపు గజానికి రూ.లక్ష ధర నిర్ణయించడంలో కలెక్టర్ చొరవ తీసుకున్నందుకు రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను, అలాగే ఎస్‌డీసీఎల్ అధికారి మాలతిని శాలువాలతో సన్మానించారు.

మూడ్చింతలపల్లి కేశవరం గ్రామంలో ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు

•లబ్ధిదారులతో కలిసి ఇళ్లను ప్రారంభించిన అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

•పండుగ వాతావరణంలో కొత్త ఇళ్లలో అడుగుపెట్టిన కుటుంబాలు

మన మహతి న్యూస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడ్చింతలపల్లి కేశవరం జూన్ 01

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో సోమవారం గృహప్రవేశాల మహోత్సవం పండుగ వాతావరణంలో జరిగింది. మూడ్చింతలపల్లి మండలం కేశవరం గ్రామంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, మార్కెటింగ్ చైర్మన్ నరసింహులు యాదవ్, గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్టీఏ కమిషన్ సభ్యులు జైపాల్ రెడ్డి తదితరులు లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. పూలతోరణాలు, రంగవల్లులతో ఇళ్లను అందంగా అలంకరించిన లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. సొంతింటి కలను సాకారం చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

Printed, Published & Owned by Boda prakash s/o krishna h.no 3-2 satyanarayana puram Edulapuram khammam rural Telanagana 507003 , Printed at Maddineni Nageshwara Rao , H.NO 1-17 18 , Svn Colony, Edulapuram, khammam rural Telanagana 507003, EDITOR : Boda prakash PH : 9000005078 & 9133935333 , RNI. NO TGTEL/26/A0372. EMAIL: manamahati@gmail.com